

సమావేశంలో మాట్లాడుతున్న కేతిరి రాజశేఖర్

## ఎమ్మెల్సీ కవితను విమర్శించడం సరికాదు

- వెంటనే క్షమాపణ చెప్పాలి
- లేకుంటే కాంగ్రెస్ నేత రామ్మోహన్ ఇంటిని ముట్టడిస్తాం
- ఎరుకల జాతి ఆత్మగౌరవాన్ని దెబ్బ తీస్తే ఊరుకోం
- ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేతిరి రాజశేఖర్

కాశీబుగ్గ, మే 14: జనాభా ప్రకారం అధికంగా ఉన్న ఆదివాసీ ఎరుకల సామాజిక వర్గానికి చెందిన వారు రాజకీయంగా, ఉద్యోగ, ఆర్థికపరంగా ఎంతో వెనుకబడి ఉన్నారని, వారిపై ప్రేమతో నాంచారమ్మ జాతరకు వచ్చిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నేత వెంటనే క్షమాపణ చెప్పాలని ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేతిరి రాజశేఖర్ డిమాండ్ చేశారు. వరంగల్ 14వ డివిజన్ ఎస్ఆర్‌నగర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇటీవల ములుగు జిల్లాలోని వెంకటాపురం మండలం రామంజాపురంలో జరిగిన ఆదివాసీ ఎరుకల ఆరాధ్య దైవమైన నాంచారమ్మ జాతరకు తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. కాంగ్రెస్ నాయకుడు సామ రామ్మోహన్‌రెడ్డి సోషల్ మీడియాలో కవితపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడని ధ్వజమెత్తారు. వెంటనే క్షమాపణ చెప్పాలని, లేకుంటే ఆయన ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. కావాలనే ఎరుకల జాతిని కించపరిచేలా అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో మానుపాటి రమేశ్, ఓని సదానందం, లోకిని సమ్మయ్య, పులిశేరి సురేశ్, బిజిలి ప్రశాంత్, కేతిరి సంతోష్‌కుమార్, భూనాద్రి రంజిత్, మానుపాటి గణేశ్, సాంబశివుడు, భిక్షపతి పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

వరంగల్ చౌరస్తా, మే 14: కేంద్రంపై దేశవ్యాప్తంగా చేపట్టిన యుద్ధానికి ప్రతి కార్మికుడు కలిసి రావాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేశ్ పిలుపునిచ్చారు. సీకేఎం హాస్పిటల్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బుధవారం సార్వత్రిక సమ్మె పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ నెల 20న చేపట్టనున్న సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐటీయూసీ సీకేఎం హాస్పిటల్ విభాగం అధ్యక్షుడు కలకోట్ల రాజు, కార్యదర్శి నాగవెల్లి శంకర్, సక్కుబాయి, శోభ, సంధ్య, గిరి, రవీందర్, శ్రీశైలం, సుభాషిణి, రాజు, స్వరూప, సునీత, కవిత, బాబు, నరేశ్ పాల్గొన్నారు.



వరంగల్ చౌరస్తా: సమ్మె పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

### భారత్ బంద్‌ను జయప్రదం చేయాలి

ఖిలావరంగల్/కాశీబుగ్గ: కార్మిక చట్టాలను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ నెల 20వ తేదీన నిర్వహిస్తున్న దేశవ్యాప్త గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐసీటీయూ మండల కన్వీనర్ చెవ్వ కుమారస్వామి పిలుపునిచ్చారు. మండలంలోని బొల్లికుంటలో బుధవారం కార్మికులతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమ్మెకు రైతు సంఘాలు కూడా పూర్తి మద్దతు ప్రకటించాయన్నారు. సమావేశంలో కృష్ణయ్య, జున్ను స్వామి, రాకేశ్, సుధాకర్, వంగపల్లి రాజు, ఉపేందర్, వెంకట్ పాల్గొన్నారు. అలాగే, సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్ కాశీబుగ్గ జంక్షన్‌లో పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎలకంటి రాజేందర్, మహబూబ్ ఖాన్, బండి కుమార్, కె.రాజేందర్, డి.సదానందం, వెంకటస్వామి, రాజేశ్, రాజు పాల్గొన్నారు.



నర్సంపేట : నర్సంపేట-నెక్కొండ, నర్సంపేట-వరంగల్ ప్రధాన రహదారులకు ఇరువైపులా దారి పొడవునా ఉన్న చెట్లకు ఎర్రని పూలు విరగబూశాయి. ప్రతి చెట్టు ఎర్రటి పూలతో ప్రయాణికులు, వాహనదారులను ఆకర్శిస్తున్నాయి.

# సర్కారు బడిలో టాయిలెట్లు కరువు

- మంత్రి ఇలాకాలో ఏడాదిగా సాగుతున్న పనులు
- 400 మంది విద్యార్థినులకు రెండు తాత్కాలిక మరుగుదొడ్లు
- బిల్లులు రాక పనులు నిలిపివేశామంటున్న కాంట్రాక్టర్
- పట్టించుకోని అధికారులు



కరీమాబాద్ జడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలలో నిర్మాణ దశలో ఉన్న టాయిలెట్లు

కరీమాబాద్, మే 14: జిల్లాలో మహిళలే పాలకులు. మంత్రి, కలెక్టర్, మేయర్, కమిషనర్.. ఇలా ఉన్నత స్థానంలో ఉన్న వారంతా మహిళలే. కానీ, 400 మంది పైచిలుకు బాలికలు ఉన్న బీరన్నకుంటలోని కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టాయిలెట్ల నిర్మాణానికి ఏ ఒక్కరూ చొరవ చూపడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొండ నాలుకకు మందుపెడితే ఉన్న నాలుక ఊడినట్లు ఉంది ప్రభుత్వ అధికారుల పనితీరు. పాఠశాలలో ఉన్న టాయిలెట్లను కూల్చి, వాటి స్థానంలో ఏడాది క్రితం కొత్త టాయిలెట్ల నిర్మాణం చేపట్టారు. రెండు తాత్కాలిక టాయ్‌లెట్స్ ఏర్పాటు చేశారు. గత వేసవి కాలంలోనే పూర్తి చేస్తామన్న అధికారులు.. 2025 వేసవి కాలం ముగింపు దశకు వచ్చినా పూర్తి చేయలేదు. దీంతో ఈ ఏడాది కూడా విద్యార్థినులకు ఇబ్బందులు తప్పేలా లేవు.

బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు మధ్యలోనే నిలిపివేశారు. దీంతో ఉన్న టాయిలెట్లు పోయి.. కొత్త టాయిలెట్ల నిర్మాణం కాక బాలికలు తీవ్ర ఇబ్బందులు పడతున్నారు. గతేడాది కలెక్టర్ టాయిలెట్ల నిర్మాణ పనులను పరిశీలించి, త్వరలోనే పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. ఏడాది గడిచినా పనులు ముందుకు సాగకపోవడంపై విద్యార్థులు, తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. బీరన్నకుంటలోని కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టాయిలెట్ల నిర్మాణ పనులు ఆలస్యం కావడంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న తూర్పు నియోజకవర్గంలో అధికారుల పనితీరుపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో నెల రోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి పనులు పూర్తి చేయించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

## నేడు ఇంటర్‌లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

నర్సంపేట, మే 14: గిరిజన బాలికల గురుకులంలో ఇంటర్‌లో ప్రవేశాల కోసం గురువారం విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలంగాణ గిరిజన గురుకుల కళాశాల(బాలికలు) ప్రిన్సిపాల్ ఏ మాధవీలత తెలిపారు. నర్సంపేట శివారులోని తెలంగాణ గిరిజన గురుకుల కళాశాల(బాలికలు) మూడుచెక్కలపల్లిలో 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన గిరిజన బాలికలు ఎంపీసీ, బైపీసీలో చేరాలనుకునే వారు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు. ధ్రువీకరణ పత్రాలతో వరంగల్‌లోని యాకుబ్‌పుర ఎస్టీ గురుకుల జూనియర్ కళాశాల(బాలురు)లో కౌన్సెలింగ్‌లో ఉంటుందని సూచించారు.

### విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి

రాయపర్తి, మే 14: విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి చెందిన ఘటన మండలంలోని ఊకల్ శివారు బీల్‌నాయక్‌తండాలో బుధవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. తండాకు చెందిన బానోత్ వెంకన్న తన రెండు దుక్కిటెద్దులను వ్యవసాయ పొలంలో మేపుతున్నాడు. ఈ క్రమంలో పొలంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎద్దు తాకడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. రూ. 80 వేల నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

### చేనేత విభాగం ఆర్గనైజింగ్ సెక్రటరీగా కరుణాకర్

పోచమ్మమైదాన్, మే 14: రాష్ట్ర చేనేత విభాగం ఆర్గనైజింగ్ సెక్రటరీగా వరంగల్ 12వ డివిజన్‌కు చెందిన బాసాని కరుణాకర్‌ను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మంత్రి కొండా సురేఖ చేతులమీదుగా ఆర్డర్ కాపీలను అందజేశారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు గూడూరి శ్రీనివాస్, చిప్ప వెంకటేశ్వర్లుకు కరుణాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

## కోటలో బుర్ర రాములు యాది సభ

ఖిలావరంగల్, మే 14: మానవ హక్కుల నేత డాక్టర్ బుర్ర రాములు 14వ యాది సభను బుధవారం ఖిలావరంగల్‌లోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి కుటుంబ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు, మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి బదావత్ రాజు మాట్లాడారు. బుర్ర రాములు విద్యార్థి దశ నుంచే సామాజిక అవగాహనతో ప్రగతిశీల ఉద్యమాలను నిర్మించారని అన్నారు. 1980 నుంచి రెండు దశాబ్దాల చీకటి కాలంలో నాటి ప్రభుత్వాలు పౌర ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తుంటే అమరులు డాక్టర్ బాలగోపాల్, నర్రా ప్రభాకర్‌రెడ్డితో కలిసి పీడిత ప్రజల పక్షాన నిలబడ్డారని గుర్తుచేశారు. కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు హరికృష్ణ, నాయకులు పాలకుర్తి సత్యనారాయణ, సాదు రాజేశ్, శ్రీనివాస్, యాదగిరి, మాజీ కార్పొరేటర్ బైరబోయిన దామోదర్, అడ్వకేట్ తీగల జీవన్, మైదం సంజీవ, ఐలయ్య, మైదం పాని, హరిబాబు పాల్గొన్నారు.



బుర్ర రాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నేతలు, కుటుంబ సభ్యులు

## కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలి

### అధికారులను కోరుతున్న దళిత కాలనీ వాసులు

నల్లబెల్లి, మే 14: మండలకేంద్రంలోని దళితకాలనీ వాసులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ ప్రత్యేకాధికారితోపాటు ఎంపీడీవో, మిషన్ భగీరథ అధికారులు కాలనీని సందర్శించిన దాఖలాలు లేవని దళితులు దండు మాధురి, సుమలత, కొంకమ్మ, యోశోబు, రమేశ్, మహేశ్, మరియ, సురేశ్‌తోపాటు పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై కార్యదర్శిని వివరణ కోరగా.. కాలనీలో మిషన్ భగీరథ పైప్‌లైన్ వేశామన్నారు. పైపులకు చిన్నపాటి మరమ్మతులు ఏర్పడ్డాయని, రిపేర్లు చేసేందుకు వచ్చిన తనతోపాటు సిబ్బందిని ఇదే కాలనీకి చెందిన నాగెల్లి సామ్యేల్ అడ్డుకుంటున్నాడని, దీనివల్ల కాలనీకి నీరందడం ఇబ్బందిగా మారిందని తెలిపారు. కాగా, బుధవారం కాలనీవాసులు నిరసన తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.



నిరసన తెలుపుతున్న దళిత కాలనీ వాసులు

## ఎట్టకేలకు బస్ షెల్టర్ నిర్మాణం

పోచమ్మమైదాన్, మే 14: ఎట్టకేలకు పోచమ్మమైదాన్‌లో బుధవారం బస్ట్ షెల్టర్ నిర్మించారు. ఎండలో ప్రయాణికుల ఇబ్బందులపై ఇటీవల 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితమైంది. అయితే, ప్రపంచ సుందరీమణుల పర్యటన వల్ల హనుమకొండ, వరంగల్ మార్గమధ్యలో ఉన్న పోచమ్మమైదాన్ బస్‌షెల్టర్‌కు కలిసి వచ్చింది. అందమైన భామలు నగరంలో పర్యటిస్తున్నప్పుడు ఇలాంటి బస్ షెల్టర్ ఉంటే బాగుండదని గ్రహించిన ఆర్టీసీ అధికారులు స్థానిక కార్పొరేటర్ బస్వరాజు శిరీష-శ్రీమాన్ సహకారంతో యుద్ధప్రాతిపదికన నిర్మించారు. దీంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.



బస్ షెల్టర్‌లో ఉన్న ప్రయాణికులు



మహేందర్‌కు నివాళులర్పిస్తున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

## బాధిత కుటుంబాలకు అండగా ఉంటా

రాయపర్తి, మే 14: బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండలంలోని మహబూబ్‌నగర్ గ్రామానికి చెందిన బీరెల్లి మహేందర్ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎర్రబెల్లి గ్రామానికి చేరుకొని మహేందర్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే, కొండూరులో బీఆర్ఎస్ నాయకుడు గొల్లపల్లి పురుషోత్తం కుమార్తె శిరీష వివాహానికి హాజరై వధూవరులకు ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ పక్షాన కానుకలు అందించి ఆశీర్వదించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల నాయకులు జినుగు అనిమిరెడ్డి, పూస మధు, కర్ర రవీందర్‌రెడ్డి, దేశగాని ఉపేందర్, నేరెల్లి రాములు, మహేశ్, గాదె రవీందర్‌రెడ్డి, మహ్మద్ యూసుఫ్, కొమ్ము రాజు ఉన్నారు.

## కోటలో భారీగా పోలీసుల మోహరింపు

**మధ్యకోటలో నాలుగు చెక్‌పోస్టులు**

ఖిలావరంగల్, మే 14: ప్రపంచ సుందరీమణుల సందర్శన నేపథ్యంలో చారిత్రక ఖిల్లాలో బుధవారం పోలీసులు భారీగా మోహరించారు. అందాల భామలు కోటకు వచ్చి వెళ్లేంత వరకూ కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టారు. కీర్తితోరణాల ప్రాంగణం వద్దకు రాకుండా నాలుగు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. చింతల్ నుంచి మట్టికోట లోపలికి వచ్చిన తర్వాత చెక్ పోస్టు పెట్టి మధ్యకోటకు రాకుండా ప్రజలను తూర్పుకోట, పడమరకోట మీదుగా దారి మళ్లించారు. అలాగే, ఖుష్‌మహల్, తూర్పుకోట ప్రధాన రహదారిపై కూడా చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రి 9 గంటలకు ప్రపంచ సుందరీమణులు కీర్తితోరణాల ప్రాంగణం నుంచి తిరిగి వెళ్లిన తర్వాత చెక్‌పోస్టులను ఎత్తివేశారు. ఇదిలా ఉండగా.. అందాల భామలను చూసేందుకు స్థానికులు ఎంతో ఆసక్తి చూపినప్పటికీ పోలీసులు బారికేడ్లు, చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ తిరిగి వెళ్లిపోయారు. అలాగే, కీర్తితోరణాలకు సమీపంలో ఉన్న ఫుడ్ కోర్టులు, హోటళ్లను పోలీసులు మూసివేయించారు.

## రైతులకు విశిష్ట కార్డు తప్పనిసరి

నెక్కొండ, మే 14: రాబోయే రోజుల్లో రైతులకు విశిష్టకార్డు తప్పనిసరి కానుందని ఏవో నాగరాజు అన్నారు. మండలంలోని పనికర గ్రామంలో బుధవారం రైతు విశిష్టకార్డు రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రధానమంత్రి కిసాన్ యోజనతోపాటు ఎరువులు, విత్తనాల కొనుగోలు, పంటల విక్రయాలకు సంబంధించి ప్రభుత్వం ఈ విశిష్ట కార్డు తప్పనిసరి చేయనుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ విధానాన్ని అమల్లోకి తెచ్చిందన్నారు. కార్యక్రమంలో ఏఈవో వసంత, రైతులు పాల్గొన్నారు.



పనికరలో రైతు విశిష్టకార్డు రిజిస్ట్రేషన్ చేస్తున్న ఏవో నాగరాజు



ముఖద్వార తోరణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

## ప్రతి ఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలి

ఖానాపురం, మే 14: ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కోరారు. బుధరావుపేటలోని శ్రీభూనీలా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ముఖద్వార తోరణాన్ని బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మహాలక్ష్మీ వెంకటనర్సయ్య, గిరిగాని నర్సయ్య, చెడుపాక ఉపేందర్, నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్, హరిబాబు, జగన్‌రెడ్డి పాల్గొన్నారు.

## 12 లీటర్ల గుడుంబా పట్టివేత

కాజీపేట, మే 14: కాజీపేట రైల్వేస్టేషన్ ప్రాంతంలో ఎక్సైజ్ పోలీసులు ఆటోను తనిఖీ చేసి అక్రమంగా తరలిస్తున్న 12 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. కాజీపేట ఎక్సైజ్ సీఐ చంద్రమోహన్ కథనం ప్రకారం.. చెన్నారావుపేట మండలం ఇండియాతండాకు చెందిన గుగులోత్ బాలి రోజూ గుడుంబాను గోల్కొండ ఎక్స్‌ప్రెస్ రైలులో కాజీపేటకు తీసుకొచ్చి ఆటోలో నగరానికి రవాణా చేస్తున్నట్లు ఎక్సైజ్ ఉన్నతాధికారులకు సమాచారం అందింది. బుధవారం బాలి కాజీపేట రైల్వేస్టేషన్‌లో రైలు దిగి తన కోసం సిద్ధంగా ఉన్న ఆటోను ఎక్కి బయల్దేరింది. ఎక్సైజ్ సిబ్బంది ఆటోను వెంబడించి పట్టుకున్నారు. 12 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకొని బాలి, వల్లెపు సాంబరాజు, వల్లెపు మహేశ్‌ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఆటోతోపాటు సెల్‌ఫోన్‌ను సీజ్ చేశామన్నారు.

## పేలిన ఆర్టీసీ అద్దె బస్సు టైర్

**ముగ్గురికి గాయాలు.. తప్పిన ప్రమాదం**

పర్వతగిరి, మే 14: వరంగల్ నుంచి అన్నారం షరీఫ్ గ్రామం వైపు వెళ్తున్న ఆర్టీసీ అద్దె బస్సు టైర్ బుధవారం మండలంలోని తురుకల సోమారం గ్రామ సమీపంలో పేలిపోవడంతో అదుపుతప్పింది. ఇందులో ప్రయాణిస్తున్న హుజూరాబాద్‌కు చెందిన ఉల్లి మాధవి, గురు ప్రసాద్, పర్వతగిరి మండలం సోమారం శివారు నల్లకుంటతండాకు చెందిన సునావత్ బాలుకు గాయాలయ్యాయి. వెంటనే చికిత్స కోసం వారిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. పెను ప్రమాదం తప్పడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.



పగిలిపోయిన టైర్

## పలువురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

కరీమాబాద్, మే 14: ప్రపంచ సుందరీమణులు ఖిలావరంగల్ కోట సందర్శనకు వచ్చిన సందర్భంగా బుధవారం మిల్స్‌కాలనీ పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకున్నారు. రాష్ట్రంలో అందాల పోటీలను నిరసిస్తూ పలువురు ఆందోళనలు చేపట్టిన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**సెప్టిక్ ట్యాంక్ క్లినర్**

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-337056

**WANTED**

★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-336370-All

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**For Classified Ads**
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

## 'దుండగులను కఠినంగా శిక్షించాలి'

రాయపర్తి, మే 14: హైదరాబాద్‌లో నాయీ బ్రాహ్మణులపై దాడులు చేసిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని నాయీ బ్రాహ్మణ సేవా సంఘం మండల ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి సధాశ్రీను బుధవారం ప్రభుత్వాన్ని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కరువై నగరానికి వలస వెళ్లి సెలూన్లు ఏర్పాటు చేసుకుని కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. కటింగ్, షేవింగ్ చేసిన తర్వాత డబ్బులు అడిగారన్న నెపంతో దుండగులు దాడులు చేయడం సరికాదన్నారు. ఆయన వవెంట నాయీ బ్రాహ్మణులు గొల్లపల్లి భిక్షపతి, యాకాంబ్రం, చంద్రయ్య, యాదగిరి, రాజు, కొమురయ్య ఉన్నారు.

## 21 మందికి షోకాజ్ నోటీసులు

గిర్మాజీపేట, మే 14: జిల్లాకేంద్రంలోని పాఠశాలలో మంగళవారం నుంచి ఐదు రోజులపాటు సోషల్, మ్యాథ్స్, ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్లకు నిర్వహిస్తున్న శిక్షణ శిబిరానికి 21 మంది ఉపాధ్యాయులు గైర్హాజరయ్యారు. ఒక్కరోజులో ప్రత్యుత్తరం ఇవ్వాలని ఆదేశిస్తూ డీఈవో మామిడి జ్ఞానేశ్వర్ బుధవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇందులో 18 మందికి రాతపూర్వకంగా వివిధ కారణాల సంజాయిషీ పత్రాలను సమర్పించారు. కొందరిని రెండో దశలో నిర్వహించే శిక్షణకు హాజరయ్యేందుకు డీఈవో అనుమతించారు. ఇప్పటివరకు ముగ్గురు ఉపాధ్యాయులు ఎలాంటి సంజాయిషీ ఇవ్వలేదని తెలిపారు. ఈ ముగ్గురిని సస్పెండ్ చేసేందుకు నిర్ణయించనున్నట్లు డీఈవో వెల్లడించారు.



ఆయిల్‌ట్యాంకర్ ఢీకొట్టడంతో విరిగిన స్తంభం

## స్తంభాన్ని ఢీకొన్న ఆయిల్ ట్యాంకర్

కరీమాబాద్, మే 14: ప్రమాదవశాత్తు ఆయిల్ ట్యాంకర్ ఢీకొనడంతో విద్యుత్ స్తంభం విరిగిపోయిన ఘటన మంగళవారం అర్ధరాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ఖమ్మం వైపు నుంచి వరంగల్ వైపు వస్తున్న ఆయిల్ ట్యాంకర్ అదుపు తప్పి నాయుడు పెట్రోల్ పంపు సమీపంలోని వినాయక కాలనీ ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో స్తంభం ముక్కలైంది. అలాగే, ఓ ఇంటి ముందున్న రేకుల పైకప్పును తాకడంతో కప్పు పూర్తిగా ధ్వంసమైంది. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

## అన్నదాతలు వద్దట.. అందాల భామలు ముద్దట

**కాంగ్రెస్ సర్కార్‌పై బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు లలితాయాదవ్ ఫైర్**



లలితా యాదవ్‌ను గృహ నిర్బంధం చేసిన పోలీసులు

కాశీబుగ్గ, మే 14: కాంగ్రెస్ ప్రభుత్వానికి అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ అన్నదాతలపై లేదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు, ఆర్‌బీఎస్ మాజీ జిల్లా కో ఆర్డినేటర్ ఎల్లావుల లలితాకుమార్‌యాదవ్ విమర్శించారు. పైడిపల్లిలోని స్వగృహంలో లలితాకుమార్ యాదవ్‌ను ఎనుమాముల పోలీసులు బుధవారం గృహ నిర్బంధం చేశారు. అకాల వర్షాలకు రైతులు నష్టపోతుంటే.. వారిని పట్టించుకోని రేవంత్‌రెడ్డి సర్కార్ అందాల భామల పర్యటన కోసం రూ. 250 కోట్లు ఖర్చు చేస్తున్నారని ఆమె విమర్శించారు. దీన్ని వ్యతిరేకిస్తున్న నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. అందాల భామల వరంగల్ పర్యటన నేపథ్యంలో తనను హౌస్ అరెస్టు చేశారని ధ్వజమెత్తారు.

## సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి

### సదస్సును పరిశీలించిన కలెక్టర్ సత్యశారద

వర్ధన్నపేట, మే 14: భూ భారతి రెవెన్యూ సదస్సులో రైతులు దరఖాస్తు చేసుకున్న ప్రతి సమస్యను పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేకంగా కృషి చేయాలని కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. మండలకేంద్రంలో బుధవారం జరిగిన భూ భారతి రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొన్ని అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై రైతులు భూ భారతి సదస్సులో దరఖాస్తులు చేసుకుంటున్నట్లు తెలిపారు. దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి రైతులకు న్యాయం చేయాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పూర్వ రికార్డులను పరిశీలించారు. అలాగే, గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యశారద

## చలివేంద్రంలో తాగునీరు ఏర్పాటు

### 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన


నర్సంపేట, మే 14: గురిజాలలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలోని రంజన్లలో బుధవారం నీరు నింపారు. 'మూన్నాళ్ల ముచ్చటగా చలివేంద్రం' శీర్షికన ఈ నెల 13న 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితమైంది. ఎంపీవో స్పందించి తాగునీరు ఏర్పాటు చేయాలని గ్రామ పంచాయతీ అధికారులను ఆదేశించారు. దీంతో కార్యదర్శి నల్లా శ్వేత ఆధ్వర్యంలో కారోబార్ కడగండ్ల చిన్ని, జీపీ సిబ్బంది తాగునీరు ఏర్పాటు చేశారు.



అందుబాటులోకి వచ్చిన చలివేంద్రం

## 'ఆదేశాలు అమలు చేయాలి'

పోచమ్మమైదాన్, మే 14: ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలపై ఇచ్చిన ఆదేశాలను తక్షణమే అమలు చేయాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో కోరారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు కనీస సౌకర్యాలపై పంచాయత్‌రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంగళవారం ఇచ్చిన ఆదేశాలను అధికారులు క్షేత్రస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉదయం 10 గంటల్లోపు, సాయంత్రం 4 గంటల తర్వాత పనులు చేయించాలని, కూలీలకు గతంలో మాదిరిగా సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలని కోరారు.



చేతిపంపును ప్రారంభిస్తున్న సంతోష్

## చేతిపంపును వినియోగించుకోవాలి

నర్సంపేట, మే 14: గ్రామస్తులు చేతిపంపును వినియోగించుకోవాలని బీఆర్ఎస్ పట్టణ నాయకుడు దొమ్మాటి సంతోష్ కోరారు. నర్సంపేట పట్టణం మాధన్నపేట రోడ్డులోని కారల్‌మార్క్స్‌కాలనీ 1వ వార్డులో బాలవికాస ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేతిపంపును బాలవికాస వాటర్ ప్లాంట్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు పుచ్చకాయల కృష్ణారెడ్డి, న్యాయవాది కందికట్ల వీరేశ్‌తో కలిసి సంతోష్ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో బాలవికాస బాధ్యులు మామిడాల ప్రశాంత్‌గౌడ్, హరీఫ్, గుజ్జుల శివ, పెండ్యాల మల్లేశ్, రాజేశ్, రాజు, బాబా, నర్సమ్మ, శ్రీను, చాంద్‌పాషా, హసీనా, వెంకన్న, సునీత పాల్గొన్నారు.